డతను. కనకదుర్గపేరు ఎలా మార్చినా బాగుండదు. అతనికి రెండక్షరాల పేర్లంటే ఎంతో మక్కువ. కాని 'దుర్గా' అంటే తనని చిన్ననాడు బరికి యీడ్చుకు పోయిన దుర్గమ్మ జ్ఞాపకం వస్తుంది. కనా – కకా – కదూ – కర్గా – ఛీ! ఛీ!! "కా" భాషలావుంది. ఆమె పేరులోని ప్రతి రెండక్షరాలతోనూ అతను ఎక్స్పెరిమెంటు చేసి ఏకాంబినేషనూ నచ్చక ఆమె నాన్నగారు పిలచినట్టు 'అమ్మాయ్' అని పిలవడం అలవాటు చేసుకున్నాడు.

ఆలోచన్లు పక్కకి నెట్టి "చూడమ్మాయ్" మళ్ళీ పిలిచేడు

"ఏం రావుడూ?'' నవ్వుతూనే సంబోధించింది ఆమె. మీద తిరుగుతున్న సీలింగుఫేను నెత్తిమీద పడి యింకా తిరుగుతున్నట్టే అనిపిస్తున్నది అతనికి. ''రావుడూ'' అని అతన్ని చిన్నప్పటి ప్రైవేటుమేష్టరు (కాకరకాయ) ఒక్కడే పిలిచేవాడు

నిజం చెప్పాలంటే ప్రేమతో తన హృదయం పొంగిపోయినప్పుడే కనకదుర్గ అతన్ని అలా పిలుస్తుంది. కాని ఆ విషయం ఒక్క కనకదుర్గకే తెలుసు. అతనికి నిజం చెప్పాలంటే ''రావ్" అని పిలిపిచుకోవాల నుంటుంది.

"నా యిష్టాయిష్టాలుకూడా తెలియవు. ఏం మ్మనిషిరా బాబూ! ' అని విసుక్కోకుండానే ''యీవేళ ఆదివారం" అన్నాడతను.

''సరిగ్గా యిలానే అన్నాట్ట 'యిది యిండియా" అని అమెరికాలో కాలు పెట్టినప్పుడు కొలంబస్'' అం దావిడ. ('విట్టు ఫరవాలేదు కాని మోటుసరసం – మొగలి పువ్వు').

''అంచేత మనం...'' అతని మాట సాగడంలేదు.

"ముష్టి ముద్దుల ఇంగ్లీషు మేటినీకి వెళ్ళాలి. అంతేనా? చూడండి బాబూ. మీకొక్కవాలంటే మీరు వెళ్ళండి; నాకసహ్యం ముద్దుల సినీమాలు. ఇంట్లో ఎలాగూ తప్పక ఛావదు కదా?'' ('తప్పక ఛావదు!! 'ఒక్కొక్క అక్షరం నూరు మెగాటన్నుల బాంబు).

''ఛీ ఛీ'' అనుకోకుండానే ఆగిపోయేడు రామారావు.

* * *

''చూడమ్మాయ్! యీ రిపోర్టు యివాళెలాగైనా పంపించెయ్యాలి.''

"నా దగ్గర స్టాంపులు అయిపోయాయండీ.'' ('ఏం హాస్యంరా బాబూ!')

"అదికాదు. చూడు తల్లీ! కాస్త కాఫీ యిస్తావేమో నని.''

"పాలు లీటరు రూపాయన్నరకివ్వడంలేదని మరచిపోకండి," అని వెళ్ళిపోయింది.

తర్వాత కాఫీకప్పు ఆమె అతని చేతికి అందించినప్పుడు, అతని హృదయంలో కృతజ్ఞత లేదు. కాఫీలో చీమని చూసి అతను కప్పు టేబిలుమీద పెట్టి

